www.prajasakti.com

ప్రజాశక్తి

శనివారం 27 డిసెంబర్ 2025

5

తూర్పుగోదావరి



27, 28న ఆర్‌ఎంసి గ్రాండ్ కార్నివాల్

కమిషనర్ రాహుల్ మీనా

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం సిటీ

నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 27, 28 తేదీల్లో గ్రాండ్ కార్నివాల్ నిర్వహిస్తున్నామని కమిషనర్ రాహుల్ మీనా శుక్రవారం ప్రకటనలో తెలిపారు. నగర ప్రజలు కుటుంబ సమేతంగా విచ్చేసి ఆనందించేలా ఫుడ్, మ్యూజిక్, ఫన్ థీమ్‌తో సుబ్రహ్మణ్య మైదానంలో ఈ వేడుకలను నిర్వహించనున్నట్లు వెల్లడించారు. రెండు రోజులపాటు జరిగే కార్నివాల్‌లో ప్రజల ఆటవిడుపు కోసం మ్యూజికల్ ఈవెంట్స్, ఫుడ్ స్టాల్స్, గేమ్స్, సెల్ఫీ బూత్ ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. ఈ వేడుకలకు ఎటువంటి ఎంట్రీ ఫీజు చెల్లించనవసరం లేదన్నారు. కావున నగర ప్రజలు తప్పక పాల్గొనాలని కోరారు.

వాచ్‌మెన్‌ల వెతలు

- అరకొర వేతనాలతో శ్రమదోపిడీ
- చలికోట్లు కూడా ఇవ్వని యాజమాన్యాలు
- ప్రశ్నిస్తే ఉన్న ఉద్యోగమూ ఉండదనే ఆందోళన

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

వారంతా వాచ్‌మెన్‌లు... కుటుంబ పోషణ కోసం తప్పనిసరి పరిస్థితుల్లో రాత్రివేళ ఎముకలు కొరికే చలిలోనూ సంస్థలకు కాపలా కాస్తున్నారు. ఒక చేతిలో కర్ర, మరో చేతిలో లైటు పట్టుకుని, గొంతులో వణుకు వస్తున్నా దిగమింగుకొని పనిచేస్తున్నారు. చలిని తట్టుకునేందుకు, ఈదురుగాలుల నుంచి కాపాడుకునేందుకు అవసరమైన చలికోట్లు (స్వెట్టర్లు), మఫ్లర్లు, బూట్లు, కాసేపు మేనువాల్చేందుకు కప్పు కోవడానికి రగ్గులు వంటివేవీ వాచ్‌మెన్‌లకు అందుబాటులో లేవు. గజగజా వణికే చలిలో ఒళ్లంతా కప్పుకొని కొందరు వారు విధులు నిర్వర్తించాల్సిన చోట స్టూల్‌పైనే కూర్చొని కాపలా కాస్తుంటే, మరికొందరు లైటు, కర్ర పట్టుకొని వారి బీట్‌మొత్తం పహారా కాస్తున్నారు. భవన నిర్మాణాల వద్ద ఉండే వాచ్‌మెన్ పరిస్థితి మరీ దయనీయంగా ఉంది. ఇక్కడ ఉండే వాచ్‌మెన్‌లు 60 ఏళ్లకు పైబడ్డవారే కావడంతో చలికి వణుకుతున్నారు. చలిని తట్టుకునేందుకు ఎలాంటి సదుపాయాలు వీరికి కూడా అందుబాటులో లేవు. పైగా రాత్రివేళ పని ప్రదేశం వద్ద ఏదైనా వస్తువు చోరీకి గురైతే ఉదయం మళ్లీ యజమానుల నుంచి చివాట్లను ఎదుర్కోవాల్సిన దయనీయ స్థితి వీరిది. వాచ్‌మెన్‌లకు వేతనాలివ్వకపోగా, పనిప్రదేశాల్లో కనీసం తాగునీటి వసతి కూడా కల్పించకుండా శ్రమదోపిడీ జరుగుతోంది. రాజమహేంద్రవరం ప్రాంతంలోనే కాదు, ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని కొవ్వూరు, నిడదవోలు పట్టణాల్లో పలువురు వృద్ధులు వాచ్‌మెన్‌లుగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఏటీఎంల వద్ద, దుకాణ సముదాయాల వద్ద, భవన నిర్మాణ పనుల వద్ద, అపార్ట్‌మెంట్లవద్ద, గ్రేటెడ్ కమ్యూనిటీ వెంచర్ల వద్ద పనిచేస్తున్న వాచ్‌మెన్ అందరి పరిస్థితి ఒకేలాగ ఉంది.


చలిమంట కాగుతున్న వాచ్‌మెన్

అరకొర వేతనాలు

జిల్లాలో సెక్యూరిటీ ఏజెన్సీల పరిధిలో పనిచేసే వాచ్‌మన్‌లు శ్రమదోపిడీకి గురవుతున్నారు. వీరిలో రాత్రిపూట వాచ్‌మన్‌గా ఉద్యోగం నిర్వర్తించేవారు ఎక్కువ పనిగంటలు కూడా పని చేస్తున్నారు. ఏటీఎంల వంటి చోట్ల 8గంటల పాటు పనిచేస్తే నెలకు రూ.8వేలు ఇస్తున్నారు. షోరూమ్‌లు, ఇతర దుకాణాల వద్ద సాయంత్రం 7 నుంచి ఉదయం 7గంటల వరకు పనిచేస్తే రూ.10వేల నుంచి రూ.12వేలు యజమానులు చెల్లిస్తున్నారు. రాత్రివేళ పనిచేసే వాచ్‌మన్‌లు సుమారు 55 ఏళ్ల వయసుకు పైబడ్డవారే ఉన్నారు. అయినా ఆర్థిక ఇబ్బందుల కారణంగా కుటుంబ పోషణ కోసం తప్పనిసరి పరిస్థితుల్లో ఎంత కొంత ఆసరాగా ఉంటుందనే ఉద్దేశంతో తక్కువ వేతనాలకైనా పనిచేస్తున్నారు. నెలకు కేవలం రెండు రోజులే సెలవులిస్తారు, అంతకుమించి సెలవులు తీసుకుంటే వేతనంలో కోత విధిస్తున్నారు. రాజమహేంద్రవరంలో సుమారు 20వరకు నిర్మాణ ప్రాంతాలు, మరో 10 అపార్ట్‌మెంట్ల వద్ద గమనించగా మొత్తానికి మొత్తం 60ఏళ్ల పైబడ్డ వయసున్న వారే వాచ్‌మెన్‌లుగా పనిచేస్తున్నారు. వీరి వేతనాల విషయానికి వస్తే నెలకు రూ.6వేల నుంచి రూ.7వేలకు మించి ఇవ్వని దయనీయస్థితి ఉంది.

కనీస వసతులు కరువు

పని ప్రదేశాల వద్ద, భిన్న వాతావరణ పరిస్థితుల్లో సైతం విధులు నిర్వహిస్తున్నా కనీస వేతనాలే కాదు, కనీస వసతులు సైతం అందుబాటులో లేవు. తాగునీరు అందుబాటులో ఉంచకపోవడంతో వీళ్లే బాటిళ్లలో నీరు తెచ్చుకొని వాడుకుంటున్నారు. వాష్‌రూమ్‌లుగానీ, గార్డ్ రూమ్‌గానీ వీరికి ఉండడం లేదు. కనీసం శీతాకాలంలో చలి తట్టుకోవడానికి అవసరమైన రగ్గులు, స్వెట్టర్లు, మఫ్లర్ల వంటి వాటిని కూడా సరఫరా చేయలేదు. అత్యంత దుర్భరమైన పరిస్థితిలో వాచ్‌మెన్‌లుగా వయోవృద్ధులు పనిచేస్తున్నారు. పలు భవన నిర్మాణాల వద్ద అక్కడే పక్కన తడికలు అడ్డుపెట్టుకొని తాత్కాలిక నివాసాలు ఏర్పాటు చేసుకొని కొందరు, మొదటి ఫ్లోర్ శ్లాబ్ పడ్డాక, దాని కిందనే మంచం ఏర్పాటుచేసుకొని మరి కొందరు చలిలో సైతం మెలకువగా ఉండి కాపలాకాస్తున్నారు.

డ్యూటీ సమయమంతా మేల్కొని ఉండాల్సిందే

నేను ఓ జ్యువెలరీ షాపు వద్ద కాపలాదారుడిగా పనిచేస్తున్నా. షిఫ్టుకు 8గంటల సమయం పనిచేయాల్సి ఉంటుంది. రాత్రి డ్యూటీ అయినా కుర్చీపై కూర్చొని మెలకువగా ఉండాల్సిందే. స్వెట్టర్లు, రగ్గులు మా స్వంత ఖర్చులతోనే కొనుగోలు చేయాలి. ఓ ప్రైవేటు సంస్థ ద్వారా ఇక్కడ విధులు నిర్వహిస్తున్నాను. నెలకు రూ.12వేలు మాత్రమే ఇస్తారు.

- ఆర్.రాజేష్, వాచ్‌మెన్, కోటిపల్లి బస్టాండ్, రాజమహేంద్రవరం

బతుకు తెరువు కోసం తప్పట్లేదు

నాకు 70 ఏళ్లు. అయినా వాచ్‌మన్‌గా పనిచేయక తప్పడం లేదు. రాత్రిపూట బిల్డింగు పనివద్ద కాపలా ఉంటే నెలకు రూ.7వేలు ఇస్తారు. ఈమధ్య చలిబాగా పెరిగింది. కాని, పనికి రాక తప్పడం లేదు. పనికి రాకపోతే పూటగడవదు. అందుకే ఎలాగో ఓర్చుకొని వాచ్‌మన్‌గా పని చేస్తున్నా. రగ్గులు, చలికోట్లు నాసొంత ఖర్చులతోనే కొనుగోలు చేసుకున్నాను.

- కె.వాసు దేవరావు వాచ్‌మెన్, దానవాయిపేట, రాజమహేంద్రవరం


నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు, సభ్యులు

అప్పలరాజును విడిచి పెట్టాలి

పీడీ యాక్టును ఉపసంహరించాలి
శ్యామల సెంటర్ వద్ద సిపిఎం ధర్నా

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం సిటీ

సిపిఎం అనకాపల్లి జిల్లా నాయకులు ఎం.అప్పలరాజుపై అక్ర మంగా బనాయించిన పీడీ యాక్టు కేసును ఉపసంహరించాలని, అప్పలరాజుని వెంటనే విడుదల చేయాలని సిపిఎం డిమాండ్ చేసింది. రాష్ట్ర ప్రభుత్వ నిరంకుశ వైఖరికి నిరసనగా స్థానిక శ్యామల సెంటర్ వద్ద సిపిఎం ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్ మాట్లాడారు. ఫార్మా లాబీ, కార్పొరేట్లకు కొమ్ముగాసి, వారిని సంతృప్తిపర్చడానికి రాష్ట్ర ప్రభుత్వం ఇటువంటి నిరంకుశ చర్యలకు పాల్పడుతుందని విమర్శించారు. ఉమ్మడి రాష్ట్రంలో 2013 మేలో నమోదైన కేసు నుంచి తాజాగా రాజయ్యపేట బల్క్ డ్రగ్ పార్క్ కేసు వరకు మొత్తం 19 కేసుల్లో, ప్రభుత్వం అప్పలరాజును నిందితునిగా పేర్కొందన్నారు. ఈ కేసుల్లో రెండింటిలో కోర్టులు నిర్దోషిగా తేల్చగా, 12 కేసులు మూసివేశారని తెలిపారు. ఒక కేసు సివిల్ వివాదంగా ఖరారు చేయగా, మరో నాలుగు కేసులు దర్యాప్తులో ఉన్నాయని, ఇందులోనూ 151 సెక్షన్ కేసులే ఎక్కువని తెలిపారు. అప్పలరాజును నిర్బంధించాలన్న దుర్బుద్ధితో పీడీ యాక్టు ప్రయోగించారని స్పష్టంగా అర్థమవుతుందన్నారు. ప్రజల ప్రయోజనాలు, భూములు కోల్పోతున్న పేద రైతులు, అందులోనూ అసైన్డ్ భూములు సాగుచేస్తున్న దళిత, గిరిజన బలహీనవర్గాల వారి కోసం, వృత్తి, ఉపాధి కోల్పోయే వ్యవసాయ కార్మికులు, మత్స్యకారులు, ఇతర వృత్తిదార్ల ప్రయోజనాలు కాపాడడానికి అప్పలరాజు ఉద్యమాల్లో పాల్గొంటూ వారికి నాయకత్వం వహిస్తున్నారే తప్ప సొంత ప్రయోజనాల కోసం కాదని వివరించారు. ప్రజల, ప్రభుత్వ ఆస్తులను కాపాడే ధ్యేయంతో ప్రజలను కదిలించి ఉద్యమాలు నడుపుతున్నందుకే ప్రభుత్వం ఆయనపై కక్ష కట్టిందన్నారు. పీడీ చట్టం నోటీసులో పేర్కొన్నట్టు అప్పలరాజు భూకబ్జాదారు కాదని, కార్పొరేట్ల లాభాల కోసం సముద్ర తీరాన్ని, పర్యావరణాన్ని విషతుల్యం చేస్తున్న ప్రయత్నాలను ఎండగట్టి రాజ్యాంగం, చట్ట ప్రకారం ప్రభుత్వం వ్యవహరించాలని ప్రజలను సమీకరిస్తున్నారే తప్ప ఆయన ఏ రకంగానూ ఎవరిపైనా గూండాగిరి చేయలేదని వివరించారు. ఈ కేసులు పరిశీలిస్తే ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్, ఆ తరువాత టిడిపి, వైసిపి, ఇప్పుడు టిడిపి కూటమి ఇలా ఏ పార్టీ అధికారంలో ఉన్నా అప్పలరాజు స్థానిక ప్రాజెక్టు బాధితుల పక్షాన నిలబడ్డారన్నారు. పాలన చేస్తున్నవారు కార్పొరేట్ సేవలోనే తరిస్తున్నారని విదితమవుతుందని వివరించారు. గంజాయి, ఎర్రచందనం, రేపిస్టులు, హ్యూమన్ ట్రాఫికింగ్ చేసేవారిని వదిలి నిజాయతీతో నిస్వార్థంగా ప్రజల కోసం పోరాడుతున్న అప్పలరాజుపై పీడీ చట్టం ప్రయోగించడం ప్రభుత్వ నైజాన్ని తెలియజేస్తుందని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అప్పలరాజుపై పెట్టిన పీడీ యాక్ట్‌ను ఉపసంహరించుకోకపోతే భవిష్యత్తులో ప్రజల ఏకం చేసి ఉద్యమాలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.పవన్, జిల్లా కమిటీ సభ్యులు కెఎస్.రామచంద్రరావు, బి.పూర్ణిమరాజు, సిటీ కార్యదర్శి కె.రామకష్ణ, ఎస్ఎస్.మూర్తి, ఎన్.రాజా,సింగ్, సత్తిరాజు, వి.రాంబాబు, చిన్న తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులను సత్కరిస్తున్న యాజమాన్యం

క్రికెట్‌కు పోటీలకు ఎంపికైన విద్యార్థులకు సన్మానం

ప్రజాశక్తి -దేవరపల్లి

జాతీయ స్థాయి మహిళల అండర్-17 ఎస్‌జిఎఫ్ క్రికెట్ పోటీలకు ఆంధ్రప్రదేశ్ తరపున ఎంపికైన దేవరపల్లి భాష్యం స్కూల్‌కు చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థిని జి.తస్యశ్రీ, పదో తరగతి విద్యార్థిని టి.యశశ్రీలను శుక్రవారం ఘనంగా సత్కరించారు. రాజమండ్రికి చెందిన ప్రముఖ వైద్యులు డాక్టర్ గోరంట్ల రవిరాం కిరణ్, భాష్యం జోనల్ ఇన్‌చార్జ్ వి. ఆంజనేయులు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ రవిరాంకిరణ్ మాట్లాడుతూ విద్యార్థుల చదువుతో పాటు క్రీడీలను భాగంగా చేసుకోవాలన్నారు. క్రీడల వల్ల క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, గెలుపు ప్రణాళికలు రూపొందించుకునే నైపుణ్యం అలవడుతుందన్నారు. భాష్యం స్కూల్ ప్రిన్సిపల్ పి.పేరయ్యనాయుడు మాట్లాడుతూ కృష్ణాజిల్లా నున్నలో జరిగిన అంతర్ జిల్లా మహిళా క్రికెట్ పోటీల్లో ఉమ్మడి పశ్చిమగోదావరి జట్టుకు ప్రాతినిథ్యం వహించి తస్యశ్రీ, యశశ్రీలు అత్యుత్తమ ప్రతిభ కనబర్చి రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యారన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సిఐటియు మహాసభను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి -దేవరపల్లి

విశాఖపట్నంలో ఈ నెల 31 నుంచి జరిగే సిఐటియు అఖిల భారత మహాసభను జయప్రదం చేయాలని సిఐటియు మండల కన్వీనర్ ఎస్.భగత్ పిలుపునిచ్చారు. శుక్రవారం దేవరపల్లిలో నవ చైతన్య ట్యాక్సీ యూనియన్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. డిసెంబర్ 31 నుంచి జనవరి 4 వరకు ప్రతినిధుల సభ ఉంటుందన్నారు.. విశాఖలోని మున్సిపల్ స్టేడియంలో బహిరంగ సభ జరుగుతుందని తెలిపారు. దేశంలో కార్మిక వర్గం ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి భవిష్యత్ కార్యక్రమాలు రూపొందిస్తారని తెలిపారు. దేశంలో మోడీ ప్రభుత్వం కార్మికులకు వ్యతిరేకంగా పనిచేస్తుందన్నారు నాలుగు లేబర్ కోడ్లు పెట్టుబడిదారుల ప్రయోజనం కోసమేనని విమర్శించారు రవాణా రంగంలో పనిచేస్తున్న కార్మికులకు ఎటువంటి సంక్షేమ చట్టాలు అమలు చేయడం లేదన్నారు నూతన రవాణా చట్టం రవాణా రంగ కార్మికులకు కార్మికులకు గుదిబండగా ఉందన్నారు ఈ సమావేశంలో యూనియన్ అధ్యక్షులు రాపాక గంగరాజు, నాయకుల యు.చంద్రావు, సత్తియ్య, కోడి సూరిబాబు, పండు, టి.తిమ్మరాజు, ఆర్.మణి, వై.సత్తిబాబు పాల్గొన్నారు


మహాసభ కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు



యుటిఎఫ్ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి కందుల దుర్గేష్

సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం సిటీ

సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. శుక్రవారం ఆయన రాజమహేంద్రవరంలోని ధర్మం చర కమ్యూనిటీ హాల్ వద్ద యుటిఎఫ్ డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ నాయకులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. విద్యాభివృద్ధికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యరకమంలో యుటిఎఫ్ జిల్ల ప్రధాన కార్యదర్శి ఎ.షరీఫ్, ఉపాధ్యక్షులు జె.రూపస్‌రావు, ఎం.విజయగౌరి, రాష్ట్ర కౌన్సిలర పి.జయకర్, జిల్లా కార్యదర్శులు ఇ.శ్రీమణి, దయానిధి, కె.రమేష్‌బాబు, సిహెచ్.శ్రీనివాసరావు, ఎం.శ్రీనివాసరావు, కెవిఎస్.ప్రకాష్, ఎం.నరేష్ తదితరులు పాల్గొన్నారు.



పార్కును ప్రారంభిస్తున్న దేవదాసు, సుదర్శన్‌రాజు

అంబేద్కర్, జగ్జీవన్‌రామ్ పార్క్ ప్రారంభం

ప్రజాశక్తి - నిడదవోలు రూరల్

మండలంలోని సమిశ్రగూడెం అరుంధతి పేటలో తృప్తి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రూ.13 లక్షలతో ఏర్పాటు చేసిన బిఆర్.అంబేద్కర్, జగ్జీవన్‌రామ్ పార్క్‌ను ట్రస్ట్ చైర్మన్ వడ్లమూడి దేవదాసు, ఆర్.సుదర్శన్‌రాజు శుక్రవారం ప్రారంభించారు. అనంతరం బాబు ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో ఐక్య క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఆయన క్రిస్మస్ కేక్ కట్ చేశారు. ట్రస్ట్ చైర్మన్ సెక్రటరీ ఘనంగా సన్మానించారు. చిన్నారుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దేశాబత్తుల జ్యోత్స్న, ప్రియాంక, వైస్ ఎంపిపి వి.రత్నకుమారి, సంఘ అధ్యక్ష, కార్యదర్శులు ముప్పిడి రాజారత్నం, కొల్లి శ్రీను, వైసిపి గ్రామ అధ్యక్షులు గజ్జరపు శ్రీరమేష్ స్థానిక నాయకులు యూత్ సభ్యులు పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



గుర్తింపు పొందిన పాఠశాలల్లోనే చేర్పించాలి

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం సిటీ

రాష్ట్ర ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లోనే విద్యార్థులను చేర్పించాలని జిల్లా విద్యాశాఖ అధికారి కంది వాసుదేవరావు తల్లిదండ్రులను కోరారు. జిల్లాలో కొన్ని ప్రైవేటు పాఠశాలల యాజమాన్యం ఒకటి నుంచి ఏడు తరగతుల వరకు గుర్తింపు పొంది, 8,9,10 తరగతులకు కూడా విద్యార్థులు చేర్చుకుంటున్నట్లు తమకు ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. గుర్తింపు లేకుండా అలా చేర్చుకోవడం చట్టరీత్యా నేరం అన్నారు. గుర్తింపు లేని తరగతుల్లో చదివిన విద్యార్థి ఉన్నత తరగతులకు చేరేందుకు అవకాశం ఉండదన్నారు. తల్లిదండ్రులు ప్రయివేటు పాఠశాలల్లో తమ పిల్లను చేర్చేటప్పుడు ఏ తరగతులకు గుర్తింపు ఉందో క్షుణ్ణంగా పరిశీలించాలని తెలిపారు. ఏ ప్రైవేటు యాజమాన్య పాఠశాలలో అయినా ఇటువంటి చర్యలను క్షమించేది లేదని, చట్టరీత్యా క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామన్నారు. అటువంటి పాఠశాలల ప్రస్తుత గుర్తింపు సైతం రద్దు చేస్తామని హెచ్చరించారు.

న్యూ ఇయర్ వేడుకల్లో నిబంధనలు తప్పనిసరి

ప్రజాశక్తి-కడియం

న్యూ ఇయర్ వేడుకల్లో పోలీసుల నిబంధనలను తప్పక పాటించాలని కడియం, ధవళేశ్వరం సిఐలు అల్లు వెంకటేశ్వరరావు, గణేష్ స్పష్టం చేశారు. అర్ధరాత్రి రోడ్లపై వేడుకలకు అనుమతులు లేవన్నారు. రాత్రి 10 గంటల తరువాత వాహనాలపై అత్యవసరం అయితేనే బయటకు రావాలన్నారు. మద్యం సేవించి, ట్రిపుల్ రైడింగ్ చేస్తూ వాహనాలు నడుపరాదన్నారు. డిసెంబర్ 31వ తేది రాత్రివేళ గ్రామాల్లో గస్తీ ముమ్మరంగా ఉంటుందన్నారు. యువత మద్యం సేవించి అల్లర్లకు పాల్పడితే పరిణామాలు తీవ్రంగా ఉంటాయన్నారు. డిజెలు, మందుగుండు సామాగ్రి పేల్చుటకు ఎటువంటి అనుమతి లేదనీ తెలిపారు. ద్విచక్ర వాహనాలకు సైలెన్సర్ తీసివేసి అధిక శబ్దాలతో హోరెత్తించడం, అతి వేగంతో రోడ్లపై తిరగడం, వాహనాలు నడుపుతూ విన్యాసాలు ప్రదర్శించిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. పోలీస్ సూచనలను పాటించి నూతన సంవత్సర వేడుకలు ఆహ్లాదకర వాతావరణంలో జాగ్రత్తగా జరుపుకోవాలనివారు కోరారు.



పూర్తి స్థాయి పూడికతీత చేపట్టాలి

ప్రజాశక్తి - పెరవలి

పూర్తిస్థాయిలో కాలువ పూడిక తీత తీసి తమకు సాగునీరు అందించాలని పెండ్యాల కాలువ శివారు భూముల రైతులు కోరుతున్నారు. పెండ్యాల పంపింగ్ ఎత్తిపోతల పథకం నుంచి వెళ్లే పంట కాలువ పూడకుపోయింది. ఈ పంట కాలువ కింద పురుషోత్తపల్లి, పందలపర్రు, జీడిగుంట, కానూరు అగ్రహారం, ఊసులుమర్రు గ్రామాల్లో 6,600 ఆయకట్టు ఉంది. దాల్వా ప్రారంభంలో శివారు భూములకు నీరందక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. పంట కాలువ మొత్తం గుర్రపుడెక్కతో పూడుకుపోవడంతో శివారు భూములకు సాగునీరు అందట్లేదని వారు వాపోతున్నారు. అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో ఊసులుమర్రులో మాత్రం ఉపాధి కూలీలు మూడు రోజులుగా పూడిక తీస్తున్నారు. పూర్తిస్థాయిలో పూడికతీత పనులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

కానూరు అగ్రహారంలో రీసర్వే గ్రామసభ

ప్రజాశక్తి-పెరవలి

మండలంలోని కానూరు అగ్రహారం గ్రామం సచివాలయం వద్ద శుక్రవారం తహాశీల్దార్ కె.నిరంజన్ ఆధ్వర్యంలో నాలుగో విడత గ్రామ రీ -సర్వే గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా తహాశీల్దార్ మాట్లాడుతూ 22ఎ జాబితా సమస్య, ఆన్‌లైన్‌లో నమోదు చేయాల్సిన రైతుల భూమి సమస్య, భూమి హెచ్చు తగ్గు సమస్యలను తహాశీల్దార్ వివరించారు. వాటన్నింటికీ పరిష్కార మార్గమే రీసర్వే అన్నారు. రైతులు వద్ద గల భూమి దస్తవేజు పత్రాల జిరాక్స్, ఆధార్ కార్డ్ జిరాక్స్, ఫోన్ నెంబర్, బ్యాంకు ఖాతా జిరాక్స్ కాపీలను రీ సర్వే సిబ్బందికు ఇచ్చి రైతులందరూ సహకరించాలన్నారు. రైతు సమస్యలు పరిష్కరించి వీలైనంత త్వరగా ఎల్‌పిఎం నెంబర్‌తో కూడి నూతన పట్టాదారు పాస ుపుస్తకాలు అందజేస్తామని తహాశీల్దార్ తెలిపారు. అనంతరం రెవెన్యూ సిబ్బంది ఆధ్వర్యంలో గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తమశీల్దార్ సన్నిబాబు, రెవెన్యూ అధికారి రవీంద్ర సర్వేయర్ గోపాలకష్ణ, విఆర్‌ఒలు సొంగరాజు, పాలపర్తి వెంకటేశ్వరరావు, కొమ్మిశెట్టి రాజశేఖర్, తానేటి రవికుమార్, పి.వెంకటసుబ్బారావు, మమతా మూర్తి, సూరిబాబు, దావీదు శ్రీనివాస్. గోడి ప్రసాద్, టిడిపి నాయకులు హనుమంతు సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

తపాల బీమా సాయం అందజేత

ప్రజాశక్తి - కొవ్వూరు

ఐ. వంగిడి లో జరిగిన రోడ్డు ప్రమాదంలో మతి చెందిన ఆరేపల్లి అనిల్‌కుమార్‌కు మరణానంతరం మంజూరైన తపాలా బీమా రూ.5.22 లక్షల చెక్కును ఆయన తల్లి భాగ్యలక్ష్మి కి తపాలా శాఖ తాడేపల్లిగూడెం సూపరింటెండెంట్ ముత్యాల శ్రీనివాస్ శుక్రవారం అందించారు. శ్రీనివాస్ మాట్లాడుతూ అనిల్‌కుమార్ రూ.5లక్షల పాలసీ తీసుకున్న తర్వాత ప్రమాదవశాత్తు రోడ్డు ప్రమాదంలో మరణించారన్నారు. దీనికి సంబంధజంచి పది నెలల్లో రూ.29,750 ప్రీమియం చెల్లించారన్నారు. బీమాతో అతని కుటుంబానికి కొంత మేర ఆర్థిక భరోసా వచ్చిందన్నారు. దేశంలోనే అతి తక్కువ ప్రీమియంతో ఎక్కువ బోనస్ ఇచ్చే ప్రభుత్వ సంస్థ తపాలా శాఖ మాత్రమే అన్నారు. తపాలా బీమాను రూ.లక్ష నంచి రూ.50 లక్షల వరకూ తీసుకోవచ్చన్నారు. దీన్ని వినియోగించుకోవాలన్నారు. సర్పంచ్ గోశాల నాగార్జున, నిడదవోలు తపాలా ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్ చేతుల మీదుగా చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో పోస్టల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ ఎం.గోపి, పంగిడి పోస్టుమాస్టర్ ఎం.సూర్యనారాయణబాబు పాల్గొన్నారు.


చెక్కు అందిస్తున్న సర్పంచ్, తపాలా అధికారులు

బూరుగుపల్లికి కృతజ్ఞతలు తెలిపిన బొడ్డు

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

టిడిపి రాజమహేంద్రవరం పార్లమెంటరీ కార్య నిర్వాహక కార్యదర్శిగా తనను నియమించిన రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ చైర్మన్ బూరుగుపల్లి శేషారావుకు బొడ్డు రామాంజనేయులు కృతజ్ఞతలు తెలిపారు. వేలివెన్నులోని శేషారావును ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల రాష్ట్రవ్యాప్తంగా పార్టీ పదవులకు నియామకాలు నిర్వహించిన సందర్భంగా నిడదవోలు నియోజకవర్గం నుంచిబాధ్యతాయుతమైన పార్టీ పదవి అప్పగించిన సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు. పార్టీ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఐటిడిపి నిడదవోలు నియోజకవర్గ అధ్యక్షులు అబ్బిశెట్టి సత్తిరాజు, తెలుగురైతు నియోజకవర్గ అధ్యక్షులు సలాది కృష్ణమూర్తి, టిడిపి పెరవలి మండల కార్యదర్శి ఈర్రింకి పెద్దిరాజు, పెరవలి మాజీ సర్పంచ్ సలాది శ్రీహరి, టిడిపి గ్రామ అధ్యక్షులు మాణిక్‌రెడ్డి, మురళీకృష్ణ, పెరవలి మండలం నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



నేరాలు ఘోరాలు

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

మండలంలోని సూర్యారావుపాలెం గ్రామానికి చెందిన సుంకర కృష్ణారావు(75) ఇంటి నుంచి బయటకు వెళ్లి అదృశ్యమయ్యారని తమకు ఫిర్యాదు అందినట్లు ఎస్ఐ డి.రవికుమార్ తెలిపారు. ఆయన మనుమడు దుద్దుపూడి కాశీవిశ్వనాథం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామన్నారు. తప్పిపోయిన వ్యక్తి అనారోగ్యం, మానసిక స్థితితో బాధపడుతున్నట్లు ఆయన తెలిపారు.

అదృశ్యమైన బాలికల ఆచూకీ గుర్తింపు

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం సిటీ

నగరంలో అదృశ్యమైన ముగ్గురు బాలిక ఆచూకీని పోలీసులు గుర్తించారు. దీంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఎస్పి డి.నరసింహకిశోర్ ప్రత్యేక చొరవతో అతి తక్కువ సమయంలోనే రాజమహేంద్రవరం పోలీసులు ఈ కేసును ఛేధించారు. అదృశ్యమైనట్టు తెలియగానే గాలింపు కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ఈ నెల 24 మధ్యాహ్నం వారు ఇళ్ల నుంచి బయటకు వెళ్లి అదృశ్యమయ్యారు. సిసి కెమెరాలు, టెక్నికల్ ఎవిడెన్స్, సోషల్ మీడియా అకౌంట్స్ వంటి వాటిని శోధించి ముగ్గురిని గుర్తించారు. కేసు చేదించడంలో ప్రత్యేక శ్రద్ధ చూపిన అధికారులు, సిబ్బందిని ఎస్పి అభినందించారు.

కోడి పందేలు, పేకాట శిబిరాలపై దాడులు

ప్రజాశక్తి - గోపాలపురం, సామర్లకోట

మండలంలో కోడి పందేలు, పేకాట శిబిరాలపై పోలీసులు దాడులు నిర్వహించారని ఎస్ఐ పి.మనోహర్ తెలిపారు. ట్రైనీ ఎస్ఐ పి.శివగణేష్, సిబ్బంది దొండపూడి గ్రామం మేదరపేటలో కోడి పందేలు నిర్వహిస్తున్న వారిపై దాడి చేసి ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రెండు కోడి పుంజులు, రెండు కోడి కత్తులు, రూ.5వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేశారు. అలాగే కొవ్వూరుపాడులో పేకాట శిబిరంపై దాడులు నిర్వహించి ఐదుగురిని అరెస్టు చేసినట్టు ఎస్ఐ తెలిపారు. వారి నుంచి రూ.3వేల నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఎక్కడైనా జూదాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

సామర్లకోట వేట్లపాలెంలోని మంగాయమ్మ కాలనీలో పేకాట శిబిరంపై పోలీసులు శుక్రవారం దాడి చేసిన ఏడుగురిని అరెస్టు చేశారు. పేకాడుతున్నట్టు వచ్చిన సమాచారం మేరకు సామర్లకోట సిఐ ఎ.కృష్ణభగవాన్ సిబ్బందితో కలిసి ఆకస్మికంగా దాడులు చేశారు. ఏడుగురిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.11,350 నగదు, మూడు సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుని మృతి

ప్రజాశక్తి - రాజోలు

కడలిగమళ్లపాలెం సమీపంలో గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక యువకుడు మరణించగా, ఇద్దరికి తీవ్ర గాయాలు అయ్యాయి. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజోలు మండలం కడలి గ్రామానికి చెందిన ఆకుమర్తి అన్వేష్, పెద్దపూడి శ్రీను, చెన్నాడం గ్రామానికి చెందిన దొండపాటి సన్నీ కలిసి మోటార్‌సైకిల్ కడలివడ్డీవారి గ్రూపులో జరిగిన క్రిస్మస్ వేడు కలో పాల్గొన్నారు. అనంతరం వారు మోటార్‌సైకిల్‌పై కడలి సెంటర్ నుంచి ములికిపల్లి వైపు వెళుతూ గమళ్లపాలెంలో ఉన్న సన్నీ ఇంటికి వెళ్లేందుకు ఎడవైపునకు తిరిగారు. ఈ సమయంలో వెనుక నుంచి మరో బైక్‌పై వస్తున్న సోడే గణేష్ (భద్రాచలం) మితిమీరిన వేగంతో రాంగ్ రూటులో వచ్చి వెనుక నుంచి వీరి మోటార్‌సైకిల్‌ను ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో మోటార్‌సైకిల్ పై ఉన్న ముగ్గురు యువకులు కింద పడిపోయారు. మోటర్ సైకిల్ నడుపుతున్న శ్రీనుకు, మధ్యలో కూర్చున్న సన్నీకి తీవ్ర గాయాలయ్యాయి. వెనుక కూర్చున్న ఆకుమర్తి అన్వేష్(20) వెనుకకు పడిపోవడంతో తలకు గాయమై అక్కడికక్కడే మరణించాడు. పెద్దపూడి శ్రీను ఫిర్యాదు మేరకు శుక్రవారం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పసికందు ప్రాణాలు కాపాడిన వైద్యులు

ప్రజాశక్తి-కాకినాడ

ఆడుకుంటూ మెంతో ప్లస్ డబ్బా మింగిన చిన్నారిని జిజిహెచ్ వైద్యులు సకాలంలో స్పందించి కాపాడారు. అల్లూరి జిల్లా దేవీపట్నం మండలం దేవుళ్లపల్లి గ్రామానికి చెందిన పండా జయదుర్గ, పండా దొరబాబు మూడు రోజుల క్రింతం ఫిట్స్ కోసం వైద్యం నిమిత్తం ఆసుపత్రిలో చేరారు. వారికి 9 నెలల విజయదుర్గ అనే బాబు ఉన్నాడు. శుక్రవారం బాబు ఆడుకుంటూ మెంతో ప్లస్ డబ్బా మింగేశాడు. బంధువులు గమనించి వెంటనే బాబును అత్యవసర విభాగానికి తీసుకుని వెళ్లారు. సిఎంఒ డాక్టర్ సుష్మ తక్షణమే స్పందించి డాక్టర్ సత్యవాణి, డాక్టర్ మాణిక్యం, డాక్టర్ కాంతిమా సాయంతో బాలుని గొంతులో అడ్డుకున్న మెంతో ప్లస్ డబ్బాను తీసివేశారు. దీంతో బాలుని ప్రాణాలు నిలిచాయి.

విత్తన శుద్ధి, సేంద్రియ సాగుపై అవగాహన

ప్రజాశక్తి - సామర్లకోట

వేట్లపాలెంలో శుక్రవారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. మండల వ్యవసాయ అధికారి వి.మురళీధర్ రైతులతో మాట్లాడారు. వరి సాగులో విత్తన శుద్ధి తప్పనిసరి అని తెలిపారు. వరి విత్తనాలను సూడోమోనాస్, ఫ్లోరోసెన్స్‌తో ట్రీట్మెంట్ చేయడం వల్ల మొలక శాతం పెరుగుతుందని, నేల ద్వారా వచ్చే ఎండాకు తెగులు, పొడ తెగులు వంటి వ్యాధులను సమర్థవంతంగా నివారించవచ్చని తెలిపారు. పొడి రూపంలో ఉన్న ఫ్యూడోమోనాస్ ఫ్లోరసెన్స్‌ను కిలో విత్తనానికి 10 గ్రాముల చొప్పున వినియోగించాలని రైతులకు సూచించారు. ఫార్మ్ యార్డ్ మెన్యూర్ అనగా పశువుల పెంట ప్రాముఖ్యతను వివరించారు. పశువుల పేడ, మూత్రం, ఎండిన ఆకులు, పలుచెత్త తదితరాలను కుప్పగా వేసి పూర్తిగా కుళ్లిన తర్వాత లభించే సేంద్రియ ఎరువునే ఎఫ్‌వైఎంగా పేర్కొన్నారు. ఇది నైట్రోజన్, ఫాస్పరస్, పొటాష్‌తో పాటు సూక్ష్మ పోషకాలు, సేంద్రీయ కార్బన్‌ను నేలకు అందిస్తుందన్నారు. వరిలో ఎఫ్‌వైఎం వినియోగించడం వల్ల నేలలో సేంద్రీయ కార్బన్ పెరిగి నేల మదువుగా మారుతుందన్నారు.

ముమ్మరంగా వరి నాట్లు

- అధిక శాతం వెదజల్లు విధానాన్ని అవలంబిస్తున్న రైతులు
- 10 శాతం సాంప్రదాయ విధానాన్ని వరి నాట్లు



చోడవరం లో విత్తనాలు వెదజల్లుతున్న రైతు

ప్రజాశక్తి - రామచంద్రపురం

ప్రస్తుతం రైతులంతా దాళ్వా నాట్లు వేసే పనిలో నిమగ్నమై ఉన్నారు. ముమ్మరంగా కొనసాగుతున్న నాట్లు ఇప్పటి వరకు 40 శాతం పూర్తయినట్లు వ్యవసాయ అధికారులు తెలియజేశారు. సాధారణంగా దాల్వా పంటకు రైతులు వెదజల్లే పద్ధతిలో నాట్లు పూర్తి చేస్తున్నారు. 90 శాతం మంది ఇదే విధానాన్ని కొనసాగిస్తుండగా, 10 శాతం మంది రైతులు సాంప్రదాయ నాట్లు వేస్తున్నారు. రామచంద్రపురం మండలంలో 18 ఎకరాల్లోనూ, కె.గంగవరం మండలంలో 15 వేల ఎకరాల్లోనూ, కాజులూరు మండలంలో 16 వేల ఎకరాల్లోనూ వరి పంట సాగు అవుతోంది. ఇప్పటివరకు 40 శాతం నాట్లు పూర్తిగా అవడంతో మిగిలిన రైతులు యుద్ధ ప్రాతిపదికన నాట్లు వేసేందుకు పంట దమ్ములు పూర్తి చేసి వేద జరుగుతున్నారు. వ్యవసాయ అధికారులు అంచనా ప్రకారం జనవరి మొదటి వారంలో మొత్తం వరినట్లు పూర్తవుతాయని అంచనా వేశారు. తొలకరిలో పంట నష్టం సంభవించిన రైతులు ఆ లోటును పూడ్చుకునేందుకు పెద్ద ఎత్తున దాళ్వా పంటకు ఉపక్రమించారు ఖర్చుకు వెనకాడ కుండా ఎరువులు, పెట్టుబడి అధికమైన ఖర్చులు పెడుతూ పంటలు పండించేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్నారు. ఇక వెదజల్లే పద్ధతిలో ఆకుముడి వేయడం ఆకుతీత వంటి పనులు లేకపోవడం వల్ల రైతులకు కొంతమేర కూలి పనులు కలిసి వస్తాయి. పెట్టుబడి తగ్గించి అధిక లాభాలు సమకూర్చుకునేందుకు వెదజల్లే పద్ధతి రైతులకు ఉపయోగపడుతుంది. అదేవిధంగా వెదజల్లే విధానంలో చేలు తొందరగా కోతకు వస్తాయని అధికారులు వివరించారు. బోండాల రకం అధికంగా నాటిన రైతులు దాళ్వా పంటకు రైతులు అధిక శాతం బోండాలు రకం 36 26, వంటి రకాలు అధికంగా నాట్లు వేస్తున్నారు. ఇవి 120 రోజులకు పంట చేతికి వస్తాయి. దీంతో అధికశాతం రైతులు వీటిని ఉపయోగిస్తున్నారు. వీటితోపాటుగా పిఆర్ రకం, 12 26 వంటి రకాలు రైతులు నాట్లు వేస్తున్నారు. ఇవి ప్రకృతి వైపరీత్యాలకు తట్టుకుంటాయని రైతులు వీటిని ఎక్కువగా ఎంపిక చేసుకుంటారు.

ఎరువుల కొరత లేకుండా చర్యలు

ప్రస్తుతం రైతన్నలకు దాళ్వా లో ఎరువులు కొరత లేకుండా చర్యలు తీసుకున్నామని మండల వ్యవసాయ అధికారి టివిఆర్.మణిదీప్ 'ప్రజాశక్తి'కి తెలిపారు. తొలకరిలో యూరియా కొరత ఏర్పడడంతో రైతులు ఇబ్బందులకు గురయ్యారని ప్రస్తుతం యూరియాతోపాటు డిఎపి ఎరువులు రైతులకు పూర్తిగా అందుబాటులో ఉన్నాయని దాల్వా వరి చేతికి వచ్చేవరకు రైతులకు ఎరువులు పురుగుమందులు పూర్తిగా అందుబాటులో ఉండేందుకు అన్ని రైతు సేవా కేంద్రాల్లోనూ స్టాకులు ఏర్పాటు చేశామని రైతులందరికీ ఎరువులు కొరత ఉండదని ఈ సందర్భంగా ఆయన వివరించారు. అదేవిధంగా నానో యూరియాపై అవగాహన కల్పించామని దీన్ని వాడటం వల్ల ఉపయోగం అధికంగా ఉంటుందని మండల వ్యవసాయ అధికారి తెలియజేశారు.



నరసరావుపేటలో సాంప్రసాయి నాట్లు వేస్తున్న కూలీలు

ఘనంగా క్రిస్మస్ వేడుకలు



ఆదివారం పేటలో క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న మంత్రి సుభాష్

ప్రజాశక్తి - రామచంద్రపురం

రామచంద్రపురం పట్టణంలోని తోటవారి వీధి, అన్నాయిపేట, ఆదివారపు పేటలో జరిగిన క్రిస్మస్ వేడుకలో మంత్రి సుభాష్ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ క్రీస్తు మార్గం అనుసరణీమన్నారు. ప్రజలు అందరూ సుఖ సంతోషాలతో క్రిస్మస్ జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఆయా సంఘాల పాస్టర్లు, సంఘ పెద్దలు, అధిక సంఖ్యలో క్రైస్తవులు పాల్గొని ప్రార్థనలు చేశారు. అనంతరం చిన్నారులు నిర్వహించిన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలోపాస్టర్ ఆనంద్ కమార్, కనికళ్ళ కనకరత్నం కూటమి నాయకులు చందమామ వాసు, కంచుమర్తి బాబురావు, కవల నానాజీ, పలువురు కూటమి పార్టీ నాయకులు, క్రైస్తవులు పాల్గొన్నారు. అనంతరం పేదలకు మంత్రి చేతుల మీదుగా దుస్తులు పంపిణీ చేశారు.

ఆలమూరు: నర్సిపూడిలో జరిగిన క్రిస్మస్ వేడుకల్లో ఎంఎల్ఎ బండారు సత్యానందరావు పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకుని రాష్ట్రంలో 8,418 పాస్టర్లకు నెలకు రూ.5,000 చొప్పున 12 నెలలకు రూ.60 వేల ఒకేసారి అందించామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎఎంసి ఛైర్మన్ దునే స్వామి నాయుడు, డిసి అధ్యక్షుడు మెర్ల గోపాలస్వామి, టిడిపి మండల అధ్యక్షుడు ఈదల సత్తిబాబు, తదితరులు పాల్గొన్నారు.



నర్సిపూడి చర్చిలో ప్రసంగిస్తున్న ఎంఎల్ఎ బండారు



మండపేటలో ఎంఎల్ఎ వేగుళ్లను సత్కరిస్తున్న సాయి తదితరులు

ఎంఎల్ఎ వేగుళ్లను కలిసిన సాయి

ప్రజాశక్తి - కపిలేశ్వరపురం, మండపేట

టిడిపి అమలాపురం పార్లమెంట్ మెయిన్ కమిటీ అధ్యక్షనిగా గుత్తుల సాయి ఉపాధ్యక్షులుగా ముత్యాల వెంకట్రావు, కార్యనిరాహక కార్యదర్శిగా కుంచె ప్రసన్న కుమార్ నియమితు లయ్యారు. శుక్రవారం మండపేట టిడిపి కార్యాలయంలో వారంతా రాష్ట్ర అంచనాల కమిటీ ఛైర్మన్, ఎంఎల్ఎ వేగుళ్ళ జోగేశ్వరరావు ను మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞత తెలిపారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ వేగుళ్ళను పూలమాలలు, దుశ్శాలు వాతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. అనంతరం నియమితులైన వారందరిని ఎంఎల్ఎ వేగుళ్ళ దుశ్శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు

జనార్ధనస్వామి ఆలయంలో ముక్కోటికి ఏరాట్లు

ప్రజాశక్తి - ఆలమూరు



పరిశీలిస్తున్న ఎంపిడిఒ ఎ.రాజు

ఈనెల 30న ముక్కోటి ఏకాదశి మహా పర్వదినాన్ని పురస్కరించుకుని ఈ నెల 30న నవ జనార్ధన ఆలయాల్లో ప్రముఖమైన ఆలమూరు శ్రీదేవి, భూదేవి సమేత జనార్ధన స్వామి ఆలయంలో ఏర్పాట్లు చేస్తున్నారు. శుక్రవారం ఎంపిడిఒ ఎ.రాజు, తహశీల్దార్ ప్రకాష్ బాబు, ఎస్ఐ నరేష్‌లకు ఉత్తర ద్వార దర్శనం నిమిత్తం వచ్చే వారికి ప్రభుత్వం తరపున చేయాల్సిన ఏర్పాట్ల గురించిన సిఫార్సు లేఖలను ఆలయ ఛైర్మన్ బైరిశెట్టి రాంబాబు, ఇఒ నరేంద్ర కుమార్‌లు అందజేశారు. దీంతో ఎంపిడిఒ రాజు స్వయంగా ఆలయానికి విచ్చేసి జరుగుతున్న ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రానున్న యాత్రికులను రద్దీని దృష్టిలో ఉంచుకొని, వివిధ శాఖలతో సమన్వయం చేసుకొని ఏర్పాట్లను పూర్తి చేయాలని ఆయన సూచించారు.



అనాతవరం పాల్ ల్యాబ్ రికార్డులు పరిశీలిస్తున్న ఎఎంఒ పి.రాంబాబు

పాల్ ల్యాబ్స్ వినియోగంలో జిల్లాకు ద్వితీయ స్థానం

ప్రజాశక్తి - ముమ్మిడివరం

పిఎంశ్రీ పాఠశాలల్లో పర్సనలైజ్డ్ అడాప్టివ్ లెర్నింగ్(పాల్) ల్యాబ్స్‌ను విద్యార్థులు వినియోగించుకోవడంలో జిల్లా ద్వితీయస్థానంలో నిలిచిందని సమగ్ర శిక్షా ఎఎంఒ, పాల్ ల్యాబ్స్ డిస్ట్రిక్ట్ కో- ఆర్డినేటర్ పి.రాంబాబు పేర్కొన్నారు. అనాతవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల, అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ బాలిక ల గురుకుల పాఠశాలల్లోని పాల్ ల్యాబ్‌లను శుక్రవారం సందర్శించి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంఆ 9 పిఎం శ్రీ పాఠశాలల్లో నూతనంగా పాల్ ల్యాబ్‌లు ఏర్పాటుచేశామన్నారు. ఈ పాల్ ల్యాబ్స్‌నున 96.22 శాతం వినియోగంతో రాష్ట్రంలో డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా ద్వితీయ స్థానంలో నిలిచిందన్నారు. అలాగు గురుకుల పాఠశాల విభాగంలో ముమ్మిడివరం బాలికల రెసిడెన్షియల్ పాఠశాల విద్యార్థులు పాల్ ల్యాబ్‌ను 111.67 శాతం వినియోగించి రాష్ట్రంలో తృతీయ స్థానంలో నిలిచిందన్నారు. అలాగే గతంలో మంజూరైన పాల్ ల్యాబ్స్‌లో కాలపరిమితి ముగియడంతో పాడైపోయిన ట్యాబ్స్ స్థానంలో కొత్త ట్యాబ్స్ ఏర్పాటుకు రాష్ట్ర ఉన్నతాధికారులకు నివేదించనున్నామని అన్నారు. అనంతరం పాల్ ల్యాబ్‌లో వినియోగిస్నుత్న రికార్డులను పరిశీలించి, పాల్ ల్యాబ్ నోడల్ టీచర్ కె.తాతాజీ, ఇంగ్లీషు, తెలుగు ఉపాధ్యాయులు డి.వెంకట శేషారత్నం, జె.నాగవరలక్ష్మిలకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో అనాతవరం ప్రభుత్వ పాఠశాల ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయుడు ఎం.శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు పోటీలు

ప్రజాశక్తి - రావులపాలెం

పొడగట్లపల్లి లక్ష్మీపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో వీర బాల దివాస్‌ను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కొత్తపేట సిడిపిఒ ఎ.గజలక్ష్మి ఆదేశాలు మేరకు సూపర్‌వైజర్ నాగ సత్యవేణి పర్యవేక్షణలో కార్యకర్త సంకు శ్రీలక్ష్మి వీర బాల దివాస్‌ను బాలలతో నిర్వహించారు. మ్యూజికల్ ఛైర్, స్టాంప్ డ్రాయింగ్ గేమ్, నెంబరింగ్ గేమ్, రన్నింగ్ రేస్ నిర్వహించారు. అనంతరం ప్రథమ, ద్వితీయ, తృతీయ, కన్సులేషన్ బహుమతులు బాలలకు అందజేశారు. కార్యక్రమంలో తల్లులు, బాలలు పాల్గొన్నారు.

హైస్కూల్‌లో వీరబాలల దినోత్సవం

ప్రజాశక్తి - రామచంద్రపురం

హసన్ బాద జెడ్‌పి ఉన్నత పాఠశాలలో సర్పంచ్ నాగిరెడ్డి సతీష్ రావు ఆధ్వర్యంలో వీర బాలల దినోత్సవం శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమానికి కర్రి చిట్టిబాబు, ఆకేటి శ్రీకృష్ణ, జిల్లా కార్యవర్గ సభ్యులు వాడ్రేవు వెంకటరావు, దక్షిణా మూర్తి తదితరులు అతిథులుగా విచ్చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పిఎస్‌బిఎస్ కె.సుందరి విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

భీమేశ్వరుని దర్శించుకున్న మాజీ సిఎస్

ప్రజాశక్తి - రామచంద్రపురం

పంచారామ పుణ్యక్షేత్రం ద్రాక్షారామ భీమేశ్వరాలయాన్ని రాష్ట్ర మాజీ సిఎస్ ఐవిఆర్ కృష్ణారావు కుటుంబసభ్యులతో శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా భీమేశ్వరస్వామిని, మాణిక్యంబా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారికి ఆలయ సహాయ కమిషనర్, ఇఒ అల్లు వెంకట దుర్గాభవాని ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు . అనంతరం కృష్ణారావు, కుటుంబ సభ్యులకు వేద ఆశీర్వచనం అందజేసి తీర్థప్రసాదాలు అందజేశారు.

ఇవిఎంల భద్రతకు పటిష్ట చర్యలు

ప్రజాశక్తి-కాకినాడ

ఇవిఎం, వివి.ప్యాట్స్ భద్రతకు పటిష్ట చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ సగిలి అధికారులను ఆదేశించారు. గురువారం కాకినాడ కలెక్టర్ కార్యాలయం వద్దనున్న ఇవిఎం గోదామును జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ సగిలి రెవెన్యూ, ఎన్నికలు అగ్నిమాపక, పోలీస్ శాఖల అధికారులు, జిల్లాలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇవిఎం, వివి.పాట్స్ భద్రతకు పటిష్ట చర్యలు చేపట్టాలని రెవెన్యూ, ఎన్నికల, అగ్ని మాపక శాఖల అధికారులను ఆదేశించారు. భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రతి నెలా ఇవిఎం గోదామును పరిశీలించి నివేదిక పంపిస్తున్నట్లు ఆయన తెలిపారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి జిల్లాలోని గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో గోదామును పరిశీలిస్తామని జిల్లా కలెక్టర్ వెల్లడించారు. ఈ పరిశీలనలో జిల్లా కలెక్టర్ వెంట అర్బన్ తహసీల్దార్ వి.జితేంద్ర, కలెక్టరేట్ ఎన్నికల విభాగం డిటి ఎం.జగన్నాథం రాజకీయ పార్టీల ప్రతినిధులు జి.సాయిబాబా (టిడిపి), ఎస్.అప్పారావు (బిఎస్‌పి), పోలిశెట్టి శ్రీను (కాంగ్రెస్), కె.కృష్ణమోహన్(ఆప్), ఆర్.వెంకటేశ్వరరావు (వైసిపి), సిహెచ్.రమేష్ బాబు (బిజెపి),పలివెల వీరబాబు(సిపిఎం), ఎ.సత్యనారాయణ (జనసేన) పాల్గొన్నారు.

ట్రాఫిక్, సైబర్ నేరాలపై అవగాహన


ప్రజాశక్తి-కాకినాడ

ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో పిఎస్ఆర్ లా కాలేజీలో ఫైనల్ ఇయర్ విద్యార్థులకు ట్రాఫిక్ నియమాలు, సైబర్ నేరాలపై శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ పోలీసులు మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు జరిగితే వెంటనే 108 లేదా 112కు సమాచారం ఇవ్వాలని, గాయపడిన వారిని గోల్డెన్ అవర్‌లోపు ఆసుపత్రికి చేర్చాలని సూచించారు. ప్రమాద బాధితులను రక్షించిన వారికి జిల్లా కలెక్టర్ ద్వారా రూ.25,000 విలువైన గుడ్ సమారిటన్ రివార్డు అందజేస్తారని వివరించారు. కాబోయే లాయర్లుగా సమాజానికి మార్గదర్శకులుగా నిలవాలని విద్యార్థులకు సూచించారు. మైనర్లు వాహనాలు నడపడం వల్ల జరిగే ప్రమాదాలు, నష్టాలపై అవగాహన కల్పించారు. ట్రిపుల్ రైడింగ్, బైక్ స్టంట్స్, రాష్ అండ్ నెగ్లిజెంట్ డ్రైవింగ్, మాడిఫైడ్ సైలెన్సర్ల వాడకం వల్ల కలిగే ప్రమాదాల గురించి వివరించారు. డ్రైవింగ్ సమయంలో సెల్‌ఫోన్ వినియోగం నిషిద్ధమని స్పష్టం చేశారు. ప్రభుత్వం జారీ చేసిన నంబర్ ప్లేట్లను మాత్రమే వాహనాలకు ఉపయోగించాలని సూచించారు.

సిఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత

ప్రజాశక్తి-పిఠాపురం

మండలంలోని మల్లాం, ఎల్ఎన్.పురం, కోలంక, ఎఫ్‌కె.పాలెం, నవఖండ్రవాడ గ్రామాల్లో పలువురికి మాజీ ఎంఎల్ఎ, టిడిపి అధికార ప్రతినిధి వర్మ శుక్రవారం సిఎం సహాయనిధి చెక్కులను అందజేశారు. ఈ సదర్భంగా వర్మ మాట్లాడుతూ సుమారు రూ.8 లక్షల చెక్కులను వారి ఇంటికి వెళ్ళి అందజేశామన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు ఎస్.గంగాధర్‌రావు, నాయకులు పిల్లా సురేష్, బుర్రా కుమార్ పాల్గొన్నారు.



అర్జీలు స్వీకరిస్తున్న ఎంఎల్ఎ బండారు సత్యానందరావు

సమస్యల పరిష్కారం కోసమే ప్రజాదర్బార్

ప్రజాశక్తి - రావులపాలెం

క్షేత్రస్థాయిలో నెలకొని ఉన్న ప్రజల సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికే ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఎంఎల్ఎ బండారు సత్యానందరావు అన్నారు. శుక్రవారం మండల పరిధి రావులపాడులో నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో ఎంఎల్ఎ బండారు సత్యానందరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజలు అందజేసిన అర్జీలను ఆయన స్వీకరించారు. పలు సమస్యలను అక్కడికక్కడే ఎంఎల్ఎ అధికారులతో మాట్లాడి పరిష్కరించారు. సంబంధిత శాఖల అధికారులు సమస్యల పరిష్కారానికి త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. సమస్యలు పరిష్కారం కాకుంటే అధికారులపై చర్యలు తప్పవన్నారు. దీనిలో భాగంగా మొత్తం 445 అర్జీలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ సిహెచ్.సుబ్రహ్మణ్యం, పెచ్చేటి చిన్నారావు, కొప్పిశెట్టి ప్రసాద్, కూటమి నాయకులు, కార్యకర్తలు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

పార్టీ అభివృద్ధికి కృషి చేయాలి ఎంఎల్ఎ మద్దిపాటి

ప్రజాశక్తి -దేవరపల్లి

టిడిపి అభివృద్ధికి కృషి చేయాలని ఎంఎల్ఎ మద్దిపాటి వెంకట్రాజు నాయకులు, కార్యకర్తలకు సూచించారు. గోపాలపురం నియోజకవర్గం నుంచి రాజమండ్రి పార్లమెంట్ కమిటీకి ఎన్నికైన సభ్యులను ప్రకటించారు. సామాజిక వర్గాల సమతుల్యాన్ని పాటిస్తూ, పార్టీ విధేయతకు ప్రాధాన్యం ఇస్తూ కమిటీని రూపొందించినట్లు తెలిపారు.. ఈ కమిటీ కూర్పు పార్టీ బలోపేతానికి దోహదపడుతుందన్నారు. రాజమండ్రి పార్లమెంట్ కమిటీకి గోపాలపురం నియోజకవర్గం నుంచి జమ్ముల సతీష్‌ను పార్లమెంట్ ఉపాధ్యక్షునిగా, ఏపూరి దాలయ్యను అధికార ప్రతినిధిగా, బల్ల సూర్యచక్రంను పార్లమెంట్ కార్యదర్శిగా, రొంగల సత్యనారాయణను మీడియా కో-ఆర్డినేటర్‌గా, కొయ్యలమూడి సుధారాణి, దాసరి ధనలక్ష్మిలను ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా నియమించారు. ఈ సందర్భంగా రాజమండ్రి పార్లమెంట్ కమిటీకి ఎన్నికైన సభ్యులందరికీ ఆయన శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు సమన్వయంతో పని చేయాలని ఆయన పిలుపునిచ్చారు.



క్షేత్రస్థాయిలో వివరిస్తున్న వ్యవసాయ అధికారి

చిలకపాడులో పొలంబడి

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

మండలంలోని చిలకపాడులో శుక్రవారం మండల వ్యవసాయ అధికారి బి.రాజారావు అధ్యక్షతన పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా రైతులకు వరి నారుమడిలో సస్యరక్షణ, వరి నాట్లు వేసుకునేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి, వరి పొలం గట్లపై వేసుకోదగిన పంటల గురించి, వివిధ రకాల వరి సాగు పద్ధతుల గురించి వివరించారు. వరిలో ప్రాథమిక దశలో ఎరువుల యాజమాన్యం, కలుపు యాజమాన్యంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మండలంలో ఎక్కడా కూడా యూరియా కొరత లేదని, రైతులు ఏ కోటా కు అవసరమైన యూరియాను ఆ సమయంలో మాత్రమే తీసుకొని, పైరు అవసరం మేరకు మాత్రమే వినియోగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది స్వప్న, లోకేశ్వరి, రైతులు, తదితరులు పాల్గొన్నారు.



పోలీసులతో మాట్లాడుతున్న దళిత సంఘాల ఐక్య జెఎసి నాయకులు

దాడికి పాల్పడిన వారిని అరెస్ట్ చేయాలి

ప్రజాశక్తి - రాజోలు

శివకోటి గ్రామంలో దళిత నాయకులపై దాడిచేసిన జనసేన నాయకుడు పినిశెట్టి బుజ్జి అతని అనుచరులపై ఎస్‌సి, ఎస్‌టి కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని దళిత సంఘాల ఐక్య జెఎసి నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు శుక్రవారం రాజోలు సర్కిల్ పోలీస్ స్టేషన్ ముట్టడించారు. తొలుత అంబేద్కర్ సామాజిక భవనంలో దళిత సంఘాల నాయకులు సమావేశం అయ్యారు. అక్కడి నుంచి ర్యాలీగా బయలుదేరి సర్కిల్‌పోలీసు స్టేషన్ వద్దకు చేరుకుని దళిత నాయకులపై దాడి చేసిన పినిశెట్టి బుజ్జిపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేయాలని నినాదాలు చేశారు. పలువురు దళిత జెఎసి నాయకులు మాట్లాడుతూ రాజమండ్రి నుంచి శివకోడు పుంతలో ముసలమ్మ ఈవెంట్‌కి వచ్చిన దళిత బాలిక పాలపర్తి భవ్య శ్రీ మరణంపై నిజ నిర్ధారణకు మానవ హక్కుల వేదిక జిల్లా కార్యవర్గ సభ్యుడు జనుపల్లి సత్యానందం అలియాస్ నాని, బహుజన సమాజ్ పార్టీ రాజోలు నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఆకుమర్తి భూషణం వెళ్లారన్నారు. అయితే వారిపై శివకోటి గ్రామానికి చెందిన జనసేన నాయకుడు పినిశెట్టి వెంకట స్వామి అలియాస్ బుజ్జి, అతని అనుచరులు దాడి చేయడం దారుణమన్నారు. పోలీసుల ఎదుటే దళితులపై దాడికి పాల్పడినా ఇంతవరకూ వారిపై కేసు ఎందుకు నమోదు చేయలేదన్నారు. భవ్య శ్రీ మరణంపై రాజకీయ ప్రలోభాలకు లొంగకుండా పోలీసులు నిష్పక్షపాతంగా దర్యాప్తు చేపట్టాలని డిమాండ్ చేశారు. దళితుల పై దాడికి పాల్పడిన పినిశెట్టి బుజ్జిని అరెస్టు చేయకపోతే జిల్లా వ్యాప్తంగా ఉద్యమం చేపడతామన్నారు. కార్యక్రమంలో బహుజన సమాజ్ పార్టీ నాయకులు బత్తుల లక్ష్మణరావు, గెడ్డం సంపదరావు, బూషి జాన్ మోషె, మానవ హక్కుల నాయకులు ఎ.రవి, ముత్యాల శ్రీనువాసరావు, చవ్వాకుల వెంకట్, పి.పవన్, దళిత సంఘాల నాయకులు కొంకి రాజా మణి, నేతల నాని, బత్తుల మురళీకృష్ణ, నల్లి ప్రసాద్, జిల్లెళ్ళ ఉదయకుమార్, మెడబల రాజకుమార్, ఉల్లంపర్తి సత్యనారాయణ, చిలకపాటి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ హాస్టళ్లలో వసతులపై సమీక్ష

ప్రజాశక్తి - రామచంద్రపురం

నియోజకవర్గంలో గల సాంఘిక సంక్షేమ హాస్టల్లో సమస్యలపై రామచంద్రపురం ఆర్‌డిఒ దేవరకొండ అఖిల శుక్రవారం జరిగిన ఎస్‌సి, ఎస్‌టి మోనటరింగ్ కమిటీ సమావేశంలో చర్చించారు. ఈ సందర్భంగా సోషల్ వెల్ఫేర్ అధికారి అబ్బిరెడ్డి శ్రీనివాసరావు వివరించారు. పట్టణంలో గల ఎస్‌సి బాలుర వసతి గృహం శిథిలావస్థలో ఉన్నట్టు వివరించారు. అదేవిధంగా పట్టణంలోని ట్రాఫిక్ సమస్య, ఎస్‌సి, ఎస్‌టి కేసుల వివరాలను ఈ సమావేశంలో చర్చించారు.

పలువురు తహశీల్దార్లు, రామచంద్రపురం డిఎస్‌పి ఇతర అధికారులు పాల్గొన్నారు.